సాక్షి వైఎస్‌ఆర్ జిల్లా

సోమవారం । 3 । జూన్ । 2024



పర్యావరణ హితం.. కావాలి అభిమతం

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి. విరివిగా మొక్కలు నాటాలి. సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు సాధించే దిశగా అడుగులు వేయాల్సిన అవసరం ఉంది. -8లో



బీన్స్ సాగు.. ఆదాయం బాగు

బీన్స్ కాయల సాగు రైతుల ఇంట సిరులు కురిపిస్తున్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో రూ.130 నుంచి రూ.150 వరకు పలుకుతుండడం విశేషం. -8లో

గరిష్టం/కనిష్టం
38.2/25.2

వాతావరణం

జిల్లాలో అదివారం 25.2 – 38.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 6.9 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

80.7 శాతం పింఛన్ల పంపిణీ

కడప రూరల్: జిల్లాలో పింఛన్ల పంపిణీ రెండో రోజైన ఆదివారం సాయంత్రం నాటికి 80.7 శాతం పూర్తయింది. మొత్తం 2,66,385 పింఛన్లకు మొత్తం రూ. 78,75,75,500 పంపిణీ చేయాలి. అందులోభాగంగా 2,14,981 పింఛన్లకుగాను రూ. 63,72,81,000 పంపిణీ చేశారు. మిగిలిన పింఛన్ల పంపిణీ సోమవారం నాటికి పూర్తయ్యేలా చర్యలు తీసుకున్నారు.

రేపు మద్యం దుకాణాలు బంద్

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: సార్వత్రిక ఎన్నికల కౌటింగ్ సందర్భంగా మంగళవారం జిల్లాలోని మద్యం దుకాణాలు, బార్లను మూసి వేస్తున్నట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ గోపాల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామాల్లో ఎక్కడైనా బెల్ట్ షాపులు నిర్వహిస్తే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తమ సిబ్బంది గ్రామాలపై నిఘా ఉంచారని తెలిపారు.

జిల్లాలోని పలు మండలాల్లో వర్షం



కడప అగ్రికల్చర్: జిల్లాలో నాలుగు రోజుల నుంచి ఎండలు అదరకొట్టాయి. శనివారం సాయంత్రం ఉన్నట్లుండి ఆకాశమంతా మేఘావృతమై పలు మండలాల్లో ఉరుములతో కూడిన వర్షం కురిసింది. సిద్దవటంలో అత్యధికంగా 30.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. సీకే దిన్నెలో 24.2, ఒంటిమిట్టలో 21.4, చెన్నూరులో 13.6, తొండూరులో 11.4, పెండ్లిమర్రిలో 9.4, వేములలో 8, మైలవరం, ఎర్రగుంట్లలో 5.2, మైదుకూరులో 4.6, దువ్వూరులో 3.2, ఖాజీపేటలో 2.8, చక్రాయపేటలో 2.6, బి.కోడూరులో 1.8, గోవపరంలో 1.4, ఆట్లూరులో 1.2, ప్రొద్దుటూరులో 1 మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది.

ఎఫ్‌ఏసీ ఏడీఏగా సురేష్‌కుమార్‌రెడ్డి



కడప అగ్రికల్చర్: కడప డివిజన్ అగ్రికల్చర్ ఎఫ్‌ఏసీ (ఫుల్ అడిషనల్ చార్జ్) ఏడీఏగా కడప ఏవో ఎస్వీ సురేష్‌కుమార్‌రెడ్డిని వ్యవసాయశాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు జిల్లా వ్యవసాయాధికారి అయితా నాగేశ్వరరావు నియమించారు. గతంలో కడప డివిజన్ ఏడీఏగా పనిచేస్తున్న సుబ్బారావు గత నెల 31న రిటైరయ్యారు. ఆయన స్థానంలో సురేష్‌కుమార్‌రెడ్డిని నియమించారు. ఈ మేరకు ఆయన బాధ్యతలను చేపట్టారు. ఈయన కడప, చెన్నూరు, ఖాజీపేట, ఒంటిమిట్ట, సీకే దిన్నె, పెండ్లిమర్రి మండలాల పరిధిలోని వ్యవసాయానికి సంబంధించిన కార్యక్రమాలను పర్యవేక్షించనున్నారు. ప్రస్తుతం ఆయా మండలాల పరిధిలో ప్రభుత్వ సబ్సిడీ విత్తనాల పంపిణీ కార్యక్రమం జరుగుతోంది. ఈ కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించేందుకు కృషి చేస్తానని సురేష్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు.

ఉత్కంఠకు రేపటితో తెర

- ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సర్వం సిద్ధం
- జిల్లా అంతటా 144 సెక్షన్



ర్యాండమైజేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ చివరి ఘట్టమైన ఓట్ల లెక్కింపు కార్యక్రమం మంగళవారం జరగనుంది. దీంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఎగ్జిట్ పోల్స్ అంచనాలు దీన్ని మరింత పెంచాయి. కౌంటింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు జిల్లా యంత్రాంగం పలు చర్యలు తీసుకుంది. జిల్లా అంతటా 144 సెక్షన్ విధించారు. విజయోత్సవ ర్యాలీలు వంటివి నిర్వహించకుండా 30 పోలీసు యాక్టు కూడా అమలులో ఉంటుంది. ఈనెల 6వ తేదీ ఎన్నికల కోడ్ ముగిసేవరకు అమలులో ఉంటుంది. సోమవారం మధ్యాహ్నం నుంచి మంగళవారం సాయంత్రం వరకు జిల్లా కేంద్రమైన కడపలో దుకాణాలు, హోటళ్లు, సినిమా థియేటర్లు, వాణిజ్య, వ్యాపార సంస్థలన్నీ బంద్ చేయాలని అధికారులు ఆదేశాలు ఇచ్చారు. పరిస్థితిని సమీక్షించి అవసరమైతే దీన్ని పొడిగించే అవకాశం కూడా లేకపోలేదు.

వాహనాల నిలిపివేత: వివిధ ప్రాంతాలనుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలకు కడపలలోకి అనుమతి లేదు. కడప మీదుగా ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు ఊటుకూరు సర్కిల్, సాక్షి సర్కిల్, ఇర్కాన్ సర్కిల్ మీదుగా ఔటర్ రింగ్‌రోడ్డుపై వెళ్లాల్సి ఉంటుంది. పులివెందుల నుంచి వచ్చే వాహనాలను సాక్షి సర్కిల్ వరకు మాత్రమే అనుమతిస్తారు. రాజంపేట నుంచి వచ్చే వాహనాలు రామాంజనేయపురం మీదుగా ఇర్కాన్ జంక్షన్ రహదారిపై గమ్యస్థానానికి చేరుకోవాల్సి ఉంటుంది. మైదుకూరు, కమలాపురం నుంచి వచ్చే వాహనాలు ఇర్కాన్ సర్కిల్ మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్ల వాహనాలను ఇందిరానగర్ వద్ద, టీడీపీ అభ్యర్థులు, ఏజెంట్ల వాహనాలు శిల్పారామం వద్ద పార్కింగ్ చేయాల్సి ఉంటుంది.

- కౌంటింగ్ ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేందుకు వీలుగా లల్లా యంత్రాంగం ఇప్పటికే ఏర్పాట్లు చేసింది. ట్రయల్ రన్ కూడా నిర్వహించారు. మూడెంచల పటిష్ట భద్రతా వలయం, సీసీ కెమెరాల నిఘా మధ్యన కౌంటింగ్ నిర్వహించనున్నారు. కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లకు ఆదివారం రెండోవిడత ర్యాండమైజేషన్ నిర్వహించడం ద్వారా నియోజకవర్గాలను కేటాయించారు. మంగళవారం ఉదయం 5 గంటలకు మూడో విడత ర్యాండమైజేషన్ ద్వారా కౌంటింగ్ టేబుళ్లను కేటాయించనున్నారు. ఉదయం 6 గంటలకు అభ్యర్థులు, ఎన్నికల పరిశీలకులు, రిటర్నింగ్ అధికారుల సమక్షంలో స్ట్రాంగ్ రూములు తెరవనున్నారు.కౌంటింగ్ ఏజెంట్లు ఉదయం 7 గంటలకు కౌంటింగ్ సెంటర్‌కు చేరుకోవాల్సి ఉంటుంది.

పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు

ఉదయం 8 గంటలకు రిటర్నింగ్ అధికారుల టేబుళ్ల వద్ద పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు కార్యక్రమం ప్రారంభమవుతుంది. తొలుత సర్వీసు ఓటర్లకు సంబంధించిన ఈటీపీబీఎస్ ఓట్లు లెక్కింపు చేపడతారు. సంబంధిత నియోజకవర్గ ఈవీఎం కౌంటింగ్ హాలుకు సమీపంలోనే ఓ ప్రత్యేక గదిలో ఈటీపీబీఎస్ ఓట్లకు సంబంధించి క్యూఆర్ కోడ్ రీడింగ్ నిర్వహిస్తారు. కౌంటింగ్ సూపర్‌వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్, క్యూఆర్ కోడ్ రీడర్ ఒక బృందంగా ఉంటారు. ఇలాంటి పది క్యూఆర్ కోడ్ బృందాలను పర్యవేక్షించేందుకు ఒక అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిని నియమిస్తారు. ఓటీపీలు స్వీకరించడానికి వీలుగా ఆర్వో, ఏఆర్‌ఓ, కౌంటింగ్ సూపర్‌వైజర్ల మొబైల్ నెంబర్లు లేదా ఈ–మెయిల్ ఐడీలు ఈటీపీబీఎస్‌తో లింక్ అయి ఉంటాయి. అలాగే కౌంటింగ్ సిబ్బంది, హోమ్ ఓటింగ్, అత్యవసర సర్వీసులకు సంబంధించిన ఉద్యోగులు వినియోగించుకున్న పోస్టల్ బ్యాలెట్ల కౌంటింగ్ నిర్వహిస్తారు. ఉదయం 8.30 గంటలకు ఈవీఎంల ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు పూర్తి కాకుండా ఈవీఎంల ఓట్ల లెక్కింపు పూర్తి చేయరాదు.

వీవీ ప్యాట్ల లెక్కింపు

ఈవీఎంల కౌంటింగ్ పూర్తయిన తర్వాత వీవీ ప్యాట్ స్లిప్పులను లెక్కిస్తారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలోని ఐదు పోలింగ్ కేంద్రాలను ర్యాండమ్‌గా ఎంపిక చేసి అందులో నమోదైన వీవీ ప్యాట్ స్లిప్పులను లెక్కిస్తారు. అబ్జర్వర్, ఆర్వోలు, అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్ల సమక్షంలో ఈ ప్రక్రియను నిర్వహిస్తారు. అలాగే కంట్రోల్ యూనిట్‌లో ఫలితాలు డిస్‌ప్లే కాని సందర్భంలో కూడా వీవీ ప్యాట్ స్లిప్పులు లెక్కిస్తారు. పోలింగ్ సందర్భంగా మాక్ పోల్ ప్రక్రియ సక్రమంగా నిర్వహించని సందర్భం ఎక్కడైనా ఉత్పన్నం అయినపుడు, సీయూలో నమోదైన ఓట్లకు, ఫారం–17సిలో నమోదు చేసిన ఓట్ల మధ్య వ్యత్యాసం ఉన్నప్పుడు కూడా ఈ స్లిప్పులను లెక్కిస్తారు.

రౌండ్ల వారీగా ఫలితాలు

ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 14 కౌంటింగ్ టేబుళ్లను ఏర్పాటు చేశారు. జిల్లాలో కనిష్టంగా 18 రౌండ్లు, గరిష్టంగా 23 రౌండ్లు ఉన్నాయి. కమలాపురం నియోజకవర్గం ఓట్ల లెక్కింపు 18 రౌండ్లలో నిర్వహిస్తారు. అన్నీ అనుకున్న విధంగా సజావుగా సాగితే తొలి ఫలితం కమలాపురందే వస్తుంది. అలాగే బద్వేలు, ప్రొద్దుటూరు, మైదుకూరు నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు 20 రౌండ్లలో పూర్తవుతుంది. కడప 21, పులివెందుల 22, జమ్మలమడుగు 23 రౌండ్లలో పూర్తవుతాయి.

కౌంటింగ్ సిబ్బందికి రెండో విడత ర్యాండమైజేషన్

కడప సెవెన్‌రోడ్స్: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ నిర్వహణ కోసం కౌంటింగ్ సిబ్బందికి రెండో విడత ర్యాండమైజేషన్ ద్వారా నియోజకవర్గాలకు విధులను కేటాయించినట్లు జిల్లా ఎన్నికల అధికారి విజయరామరాజు పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం కలెక్టరేట్‌లోని ఎస్‌పీసీ హాలులో జిల్లా ఎన్నికల పరిశీలకులు కునాల్ సిల్కు, భానుదాస్ పాలవె, జిల్లా జేసీ గణేష్ కుమార్, డీఆర్‌ఓ గంగాధర్ గౌడ్‌లతో కలిసి జిల్లా ఎన్నికల అధికారి సార్వత్రిక ఎన్నికలు–2024లో భాగంగా కౌంటింగ్ సిబ్బందికి నియోజకవర్గాల వారీగా విధులను కేటాయించే రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి విజయరామరాజు మాట్లాడుతూ కౌంటింగ్ సిబ్బందికి ఇప్పటికే ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించిన శిక్షణను కూడా ఇవ్వడం జరిగిందని, శిక్షణా తరగతులకు గైర్హాజరు అయిన సిబ్బందిపై ప్రజాప్రాతినిధ్య చట్టం –1951 ప్రకారము కఠిన చర్యలు తీసుకోడం కూడా జరిగిందన్నారు. జూన్ 4వ తేదీన ఉదయం 5 గంటలకు 3వ ర్యాండమైజేషన్ నిర్వహించి ఏయే టేబుల్‌లో కౌంటింగ్ నిర్వహించాలో తెలియజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతోపాటు సీపీఓ వెంకట్రావు, డీఐఓ విజయ్ కుమార్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల లెక్కింపునకు నాలుగంచెల భద్రత

ఎస్పీ సిద్దార్థ్ కౌశల్



ఎన్నికల కౌంటింగ్ కేంద్రం వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్

కడప అర్బన్: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ జరుగనున్న నేపథ్యంలో ఈనెల 4న బందోబస్తు విధులపై వెళ్లే సిబ్బందికి జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ ఆదివారం స్థానిక మౌంట్‌ఫోర్ట్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ కౌంటింగ్ కేంద్రం వద్ద నాలుగంచెల భద్రతా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. బందోబస్తు విధుల్లో ఉన్న జిల్లా పోలీసులు, కేంద్ర సాయుధ పోలీసు బలగాలు, ఏపీఎస్పీ బలగాలు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహించాలని ఆదేశించారు. పోలీస్ అధికారులు, సిబ్బందితో ఏర్పాటు చేసిన క్విక్ రెస్పాన్స్ టీమ్ (క్యూఆర్‌టీ)లు సిద్ధంగా ఉంటాయన్నారు. ఎలాంటి ఘటనల గురించి సమాచారం వచ్చిన వెంటనే ఘటనా స్థలానికి చేరుకుంటారని ఎస్పీ తెలిపారు. బందోబస్తు విధుల్లో అత్యుత్తమ ప్రతిభ చూపిన కానిస్టేబుల్ నుంచి ఏఎస్‌ఐ ర్యాంక్ వారికి ప్రోత్సాహకాలు అందించనున్నట్లు చెప్పారు. సమావేశం అనంతరం కౌంటింగ్ కేంద్రానికి వెళ్లే రహదారిపై అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లకు అనుమతించే దారులను ఏర్పాటు చేసిన చెక్ పోస్టులను పరిశీలించి పోలీస్ అధికారులకు సూచనలు చేశారు. అదనపు ఎస్పీ (అడ్మిన్) లోసారి సుధాకర్, ఏ.ఆర్. అదనపు ఎస్పీ ఎస్.ఎస్.ఎస్.వి.కృష్ణారావు, కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్, ఏఆర్ డీఎస్పీ మురళీధర్, రిమ్స్ సీఐ కె. రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

కొత్త కోర్సులకు గ్రీన్ సిగ్నల్

- ప్రవేశాలకు త్వరలో నోటిఫికేషన్
- మహిళా డిగ్రీ కళాశాలలో నూతనంగా 5 కోర్సులు ఏర్పాటు



ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల

వైవీయూ: కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు నూతనంగా ఐదు కోర్సులను మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. 1973లో మహిళా సాధికారతే ధ్యేయంగా జిల్లాలో ఏర్పాటైన తొలి మహిళా డిగ్రీ కళాశాల ఇదే కావడం గమనార్హం. దాదాపు 50 సంవత్సరాల చరిత్ర కలిగిన ప్రతిష్టాత్మక కళాశాలలో ప్రవేశాలకు ఈనెల 18వ తేదీన నోటిఫికేషన్ విడుదల కానుంది. తొలుత ఒకే ఒక్క బీఏ కోర్సుతో ప్రారంభమైన కళాశాలలో ఇప్పటికే 14 కోర్సులు అందుబాటులో ఉండగా, తాజాగా మరో 5 జాబ్ ఓరియంటెడ్ కోర్సుల నిర్వహణకు కళాశాల కమిషనరేట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 2024–25 విద్యాసంవత్సరం నుంచి కళాశాలలో బీకాం హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్ (హెచ్‌సీఎం), బీకాం బ్యాంక్ ఫైనాన్స్ సర్వీసెస్ ఇన్సూరెన్స్ (బీఎఫ్‌ఎస్‌ఐ), బీఎస్సీ స్టాటిస్టిక్స్ (ఆనర్స్ డిగ్రీ), బీఎస్సీ డాటా సైన్స్, బీకాం ఈ కామర్స్ మార్కెటింగ్ కోర్సులను ప్రారంభించనున్నారు.

- కళాశాలలో 24 మంది పీహెచ్‌డీ కలిగిన అధ్యాపకుల బృందం, ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్, రెడ్‌రిబ్బన్ క్లబ్, స్పోర్ట్స్, కల్చరల్ కార్యక్రమాలు, హాస్టల్ వసతి ఉండటం కళాశాలకు అదనపు ఆకర్షణ. స్కిల్ డెవలప్‌మెంట్, క్యాంపస్ డ్రైవ్‌లతో పాటు ఐసీటీ ద్వారా ఆధునిక పద్ధతుల్లో బోధన, ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సులు, తరగతి గదిలో 3డీ వ్యూలో బోధన, సీసీ కెమెరాల పర్యవేక్షణతో విద్యార్థినులకు సంపూర్ణ రక్షణ ఉండటంతో పెద్దసంఖ్యలో ప్రతియేటా ఇక్కడ విద్యార్థులు చేరుతుండటం విశేషం. న్యాక్ గుర్తింపు పొందిన ఏకైక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఇదే కావడం విశేషం.

సద్వినియోగం చేసుకోవాలి



50 సంవత్సరాలు చరిత్ర కలిగిన కళాశాలలో చదవడం విద్యార్థులకు లభించే అరుదైన అవకాశం. 14 సింగిల్ మేజర్ సబ్జెక్టులతో పాటు నూతనంగా నూతన విద్యా విదానం అనుసరించి 5 జాబ్ ఓరియంటెడ్ కోర్సులకు కళాశాల కమిషనరేట్ అనుమతి ఇచ్చింది. ఈనెల 18న నోటిఫికేషన్ విడుదల అవుతుందనుకుంటున్నాం. విద్యార్థినులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకుని ప్రవేశాలు పొందవచ్చు.

– డాక్టర్ వేమల సలీంబాషా, ప్రిన్సిపాల్, ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల

ప్రశ్నార్థకం కానున్న

షర్మిల చరిష్మా!



- కడప పార్లమెంట్‌లో డిపాజిట్ దక్కడం గగనమే
- పాత కాంగ్రెస్ నేతలను పట్టించుకోని వైనం
- ఎన్నికలప్పుడే కన్పించని చేరికలు
- అధ్యక్షురాలిగా పార్టీ పటిష్టతకు కృషి చేయలేదని అప్పుడే మొదలైన అసంతృప్తి

సాక్షి ప్రతినిధి, కడప: ''పీసీసీ అధ్యక్షురాలు షర్మిల కడప పార్లమెంట్‌కు పోటీ చేస్తోంది. కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం రాక తప్పదు. పోల్‌మేనేజ్‌మెంట్‌లో ఎవరికి తీసిపోదు. త్రిముఖ పోటీలో గెలుపు అంచుల వరకు వస్తుంది.''ఇది మొన్నటి వరకు విన్పించిన మాట. ఇప్పుడామెకు డిపాజిట్ దక్కే అవకాశం లేదని సెఫాలజిట్లు చెబుతున్నారు. కడప పార్లమెంట్‌తోపాటు ఉమ్మడి జిల్లాలో 10 అసెంబ్లీ సీట్ల ల్లో కూడా డిపాజిట్లు గగనమే. దీంతో షర్మిల చర్మిషా ప్రశ్నార్థకం కానుందని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

తెలంగాణలో పార్టీ పెట్టిన షర్మిల, ఓ సందర్భంలో 'ఇక్కడే పెరిగాను.. ఇక్కడే పెళ్లి చేసుకున్నా.. నాజీవితం ఇక్కడే ముడిపడి ఉంది, చావైనా, బతుకైనా ఇక్కడేనని' చెప్పుకొచ్చింది. తర్వాత ఆ పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేసి, అంధ్రప్రదేశ్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టింది. స్పీడ్‌గా అన్ని జిల్లాలను చుట్టేసిన ఆమె తుదకు కడప పార్లమెంట్ కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిగా బరిలో నిల్చింది. సేమ్ డైలాగ్ ఇక్కడ కూడా వర్తింప జేసింది. ఇక్కడే పుట్టాను, ఇక్కడే పెరిగాను, మీ ఆడబిడ్డను ఆదరించండి, మీకోసం తుది వరకు అండగా నిలుస్తానంటూ కోరారు. అంతవరకు బాగానే ఉన్నా, ఆపై అనర్గళంగా గుక్క తిప్పుకోకుండా మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు ప్రధాన అస్త్రంగా చూపి ఓట్లు అభ్యర్థించడం ఆరంభించింది. ఎప్పుడు తిరగని, చూడని గ్రామాలకెళ్లినా పట్టణాలకెళ్లినా పనిగట్టుకొని అమె విమర్శలు గుప్పించింది. మరోవైపు పులివెందుల ప్రాంతలో సెంటిమెంట్ అస్త్రాన్ని సైతం ప్రయోగించి, కొంగు చాచి ఓట్లు అడిగింది. ఇంతచేసినా సెఫాలజిట్లు షర్మిలకు కడప పార్లమెంట్‌లో డిపాజిట్ దక్కదని స్పష్టం చేశారు. మంగళవారం వెలువడే ఎన్నికల ఫలితాల్లో అదే రుజువవుతుందని విశ్లేషకులు వివరిస్తున్నారు.

తులసిరెడ్డికి చేదు అనుభవం

కడప పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేసిన షర్మిల తొలివిడత ప్రచారంలో డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి వెన్నంటే ఉన్నారు. జిల్లా వాసులకు పరిచయం చేస్తూ ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పర్యటించారు. రెండోవిడత ప్రచారంలో తులసిరెడ్డి ఎక్కడా లేరు. వాగ్ధాటి పటిమ ఉన్న తులసిరెడ్డిని కావాలనే దూరం పెట్టినట్లు తెలుస్తోంది. ఈమారు షర్మిల పర్యటన కనీస సమాచారం కూడా ఇవ్వకుండా చేపట్టినట్లు సమాచారం. క్రియాశీలక మైనార్టీ నాయకుడు సత్తార్ పరిస్థితి కూడా అంతే. వీరంతా షర్మిల కంటే ముందు కాంగ్రెస్ గళాన్ని జిల్లాలో విన్పించిన నాయకులు. పీసీసీ అధ్యక్షురాలు షర్మిల వ్యవహార శైలితో పక్షం రోజుల వ్యవధిలో అంటీముట్టనట్లు ఉండిపోవాల్సిన పరిస్థితి ఉత్పన్నమైంది. ఎన్నికల సందర్భంలో పార్టీ ఇమేజ్ పెంచుకోకపోగా, ఉన్న వారిని కూడా చేజార్చుకున్న పరిస్థితి ఉతపన్నమైందని విశ్లేషకులు వివరిస్తున్నారు.

అభ్యర్థుల ఖర్చులు సైతం....

షర్మిల ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తోంది. ఆ పరిధిలోని అసెంబ్లీ స్థానాలల్లో పోటీ చేసేందుకు పలువురు అభ్యర్థులు ముందుకు వచ్చారు. కారణం ఎన్నికల, పోలింగ్ బూత్ ఖర్చులు అమె భరిస్తుందని భావించారు. పోటీ చేసినా ఆయా అభ్యర్థులు కూడా చేదు అనుభవం చవిచూశారు. కడపలో పోలింగ్ బూత్ ఖర్చుల విషయమై ఏజెంట్లుగా నిలుచున్న పలువురు ఆ తర్వాత కూడా అభ్యర్థి కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. ఇలాంటి పరిస్థితి ఉత్పన్నమైన నేపథ్యంలో గణనీయమైన ఓట్లు సాధించి డిపాజిట్లు దక్కించుకుంటేనే షర్మిలకు పార్టీలో కనీస గౌరవం ఉంటుందని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.

కాంగ్రెస్‌వాదులకు దక్కని మర్యాద...

ఆంధ్రప్రదేశ్ ప్రజానీకం మొర విన్పించుకోగా, రాష్ట్రాన్ని రెండు ముక్కలు చేసిన కాంగ్రెస్ పార్టీకి ఏపీలో గడ్డుపరిస్థితి ఏర్పడింది. అలాంటి సమయంలో కూడా కాంగ్రెస్ కోసం పనిచేసిన నాయకులకు మర్యాద దక్కలేదు. అందులో భాగంగా పదేళ్లుగా కాంగ్రెస్ పార్టీకి జిల్లాలో కేరాఫ్ అడ్రస్‌గా ఉన్న నజీర్ అహమ్మద్ షర్మిల బాధ్యతలు చేపట్టిన అనతికాలంలోనే ఆ పార్టీకి దూరమయ్యారు. రాజంపేట పార్లమెంట్ అభ్యర్థిగా ఆయన పేరు ప్రకటించి తర్వాత తెలంగాణకు చెందిన ఎస్కే బాషిద్‌ను ప్రకటించారు. మనస్తాపం చెందిన ఆయన కాంగ్రెస్‌పార్టీకి దూరమయ్యారు. హైదరాబాద్‌లో స్థిర పడిన బాషిద్ ఎంపిక వెనుక షర్మిల సన్నిహితుల సిఫార్సులేనని స్పష్టమవుతోంది. అలాగే కడప నగరానికి చెందిన జక్కరయ్య పరిస్థితి అదే. కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి తాళాలు వేసిన సందర్భంలో సైతం ఆ పార్టీ జెండాను జక్కరయ్య వీడలేదు. కడప అభ్యర్థిత్వం రాత్రికి రాత్రే మార్పు చేశారు. జిల్లాలో క్రియాశీలక టీడీపీ నాయకుడితో కుదిరిన రహస్య ఒప్పందం మేరకు వైఎస్సార్‌సీపీ నేతగా ఉన్న అఫ్జల్‌ఖాన్‌ను తెరపైకి తెచ్చారు.

అకాల వర్షం..అపార నష్టం

- అన్నమయ్య జిల్లాలో ఈదురుగాలులకు నేలవాలిన అరటి, బొప్పాయి తోటలు
- మామిడి దిగుబడి నేలపాలు



లక్కిరెడ్డిపల్లె: దెబ్బతిన్న మామిడి తోట



రాజంపేట రూరల్: హస్తవరంలో దెబ్బతిన్న అరటి తోటను పరిశీలిస్తున్న ఆర్‌బీకే సిబ్బంది

రాయచోటి/రాజంపేట రూరల్: అకాల వర్షాలు అన్నమయ్య జిల్లాలో నష్టాన్ని, కన్నీటిని మిగిల్చాయి. జిల్లా వ్యాప్తంగా శనివారం రాత్రి ఈదురు గాలులతో కూడిన వానకు పంటలు దెబ్బతిన్నాయి. రాయచోటి, రాజంపేట, కోడూరు, తంబళ్లపల్లి, పీలేరు, మదనపల్లె నియోజకవర్గాలలో మోస్తరు వర్షాలు కురిశాయి. బలమైన ఈదురు గాలులు కారణంగా ఇంటి పైకప్పులు గాలిలోకి లేచి పోయాయి. మామిడి, నిమ్మ, అరటి తోటలు వేర్లతో సహా నేలకొరిగాయి. రైల్వేకోడూరు ప్రాంతంలో అరటి, నిమ్మ, బొప్పాయి పంటలు నేలవాలి అపార నష్టాన్ని కలిగించాయి.రాజంపేట మండల పరిధిలోని హస్తవరం, పోలి, మందరం, మందపల్లి, బ్రాహ్మణపల్లి, పెద్దకారంపల్లి, ఆకేపాడు, రాజంపేట రైతు భరోసా కేంద్రాల పరిధిలో 103 మంది రైతులకు చెందిన 210 ఎకరాల్లోని అరటిపంట, 15 ఎకరాల్లో బొప్పాయి, 7 ఎకరాల్లో నిమ్మచెట్లు నేలకొరిగాయి. ప్రాథమిక అంచనా ప్రకారం రూ. 2.32 కోట్లు నష్టం వాటిల్లినట్లు ఉద్యాన అధికారి జే సురేష్ బాబు తెలియజేశారు. సంబంధిత ఆర్‌బీకే సిబ్బంది ఆదివారం నేలకొరిగిన అరటిపంటలను పరిశీలించి ప్రాథమిక అంచనా వేశారు. గాలులకు రాజంపేట–నెల్లూరు రహదారిలోని పోలీ వద్ద నుంచి నారాయణ నెల్లూరు సమీపం వరకు రహదారి పక్కనున్న దాదాపు 15 వృక్షాలు నేలకొరిగాయి. దీంతో రాకపోకలు సాగించడానికి ప్రజలు ఇబ్బందులు ఎదర్కొన్నారు. రాయచోటి, పీలేరు, వాల్మీకిపురం, రాజంపేట, రైల్వేకోడూరు, లక్కిరెడ్డిపల్లె ప్రాంతాల్లో మామిడి కాయలు రాలిపోయి రైతులకు గుండెకోతను మిగిల్చాయి.నిమ్మనపల్లి, గుర్రంకొండ, కురబలకోట ప్రాంతాల్లో టమాటా పంట రెండు వందల ఎకరాల్లో దెబ్బతిన్నట్లు రైతులు వాపోతున్నారు. అనేక గ్రామాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అధికారులు స్పందించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

- ఈ ఏడాది ఎండలు అదరగొట్టాయి. ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి అయ్యారు. శనివారం రాత్రి కురిసిన వర్షం ఉక్కపోతకు విరామం ఇచ్చింది. శనివారం మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉన్నప్పటికీ గాలిలో తేమ, ఆకాశంలో మబ్బులు ఉండటంతో నెల రోజుల నుంచి వేడిని భరిస్తూ వచ్చిన జిల్లా వాసులకు కాస్త ఉపశమనం లభించింది.

మండలం	కురిసిన వర్షం(మి.మీ)		
చిన్నమండెం	69.2		
కలకడ	55.2	గాలివీడు	16.4
కలికిరి	47.0	కంభంవారిపల్లి	16.4
లక్కిరెడ్డిపల్లె	40.0	కోడూరు	16.4
రామాపురం	33.0	రాయచోటి	14.6
రాజంపేట	30.8	రామసముద్రం	10.2
మదనపల్లె	26.0	ములకల చెరువు	9.2
వీరబల్లి	21.2	నందలూరు	8.4
పెద్దమండెం	19.8	వాల్మీకిపురం	7.4



లక్కిరెడ్డిపల్లె: ట్రాన్స్‌ఫార్మర్‌పై పడిన చెట్టు



రాజంపేట రూరల్: మందరంలో కూలిన నిమ్మ చెట్లు

క్లుప్తంగా

అనంతపురం గంగమ్మకు విశేష పూజలు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

లక్కిరెడ్డిపల్లి(అన్నమయ్య జిల్లా): శ్రీ అనంతపురం గంగమ్మ ఆలయానికి ఆదివారం వేలాది మంది భక్తులు తరలివచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. బోనాలు సమర్పించారు. తలనీలాలు అర్పించారు. ఆదివారం కావడంతో చుట్టు పక్కల ప్రాంతాల వారే కాకుండా ఇతర జిల్లాల నుంచి సైతం వచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. పోలీసులు క్యూలైన్ల ద్వారా భక్తులకు దర్శనాన్ని కల్పించారు. ఆలయ చైర్మన్ రెడ్డయ్య, ప్రత్యేక అధికారి ఏర్పాట్లు పర్యవేక్షించారు. అర్చకులు చెల్లు వంశీయులు గంగాధర్, రవిలు తీర్థప్రసాదాలను అందజేశారు.

‘ఆ అధికారిని సస్పెండ్ చేయాలి’

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : అవినీతికి పాల్పడుతున్న ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్‌ను సస్పెండ్ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అన్వేష్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో దేవదాయ శాఖ ఆలయాలను నిష్పక్షపాతంగా అభివృద్ధి చేయడం లేదని తెలిపారు. దేవదాయ స్థలాలు, కాంప్లెక్స్‌లను అనుకూలమైనటువంటి వ్యక్తులకు కట్టబెడుతున్నారని విమర్శించారు. 11 ఏళ్ల నుంచి ఉన్నాడు కాబట్టి ఆయనపై ప్రొద్దుటూరు, బ్రహ్మంగారిమఠంలో వివాదాలు పెద్ద ఎత్తున ఉన్నాయని పేర్కొన్నారు. ట్రస్టులో వారసులను కాకుండా బయట వ్యక్తులను నియమించి, ఆ స్థలాలు, నిధులను కాజేసేందుకు సహకరిస్తున్నాడని చెప్పారు. ఇప్పటికే కోట్లాది రూపాయలు దుర్వినియోగమైందని, విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ట్రస్ట్ సభ్యునిగా అర్హత లేని వ్యక్తిని తొలగించాలని కోరారు. సమావేశంలో సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు మనోజ్ పాల్గొన్నారు.

పర్యావరణ హితం.. కావాలి అభిమతం

- ప్రతి ఒక్కరూ భాగస్వాములవుదాం
- సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు సాధిద్దాం
- 5 నుంచి పాఠశాలల్లో అవగాహన
- విద్యార్థి దశ నుంచే చైతన్యం



కడప ఎడ్యుకేషన్ : దేశంలో అభివృద్ధి పెరిగే కొద్దీ పుడమి తల్లికి పురుటి నొప్పులు తప్పడం లేదు. ఒక వైపు పెరుగుతున్న జనాభా, వారి విలాస భరిత జీవన పయనంలో అవసరాలు తీర్చుటకు క్రమశిక్షణ కోల్పోయి ఇష్టానుసారంగా ప్రకృతిని పాడు చేయడంతో నింగి, నేల, గాలి కలుషితమవుతున్నాయి. ఇందుకు నేడు భూతాపమే నిదర్శనం. ఆధునీకత ఎక్కువ అయ్యే కొద్దీ మనుషుల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోంది. ఒక వైపు ప్లాస్టిక్ వ్యర్థాలు, మరో వైపు మందుల తయారీతోపాటు చెట్లను నరకడం, ఏసీల విపరీత వాడకంతో వాతావరణ కాలుష్యం రెట్టింపు అవుతోంది. వీటన్నింటి పరిణామాలతో భూతాపం రోజురోజుకు పెరిగి సకాలంలో వర్షాలు కురవకపోవడం జరుగుతోంది. అలాగే ఉన్నట్లుండి విపత్తులు చోటు చేసుకోవడంతో భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోంది. ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ తమ పరిధి వరకు పుడమితల్లిని కాపాడుకునేందుకు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇందుకు సంబంధించి ప్రపంచ వ్యాప్త ఉద్యమం ఊపు అందుకుంది. ఏటా జూన్ 5వ తేదీ ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఐక్యరాజ్యసమితి అనుబంధంగా ఇంటర్ ప్యానల్ ఇన్ క్లైమేట్ ఛేంజ్ (ఐపీసీసీ) పర్యావరణ పరిరక్షణకు నడుం బిగించి సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను నిర్దేశించింది. అందులో భాగంగా పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులను చైతన్యం చేసేందుకు పొల్యూషన్‌బోర్డు, విద్యుత్, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఆటవీ, విద్యాశాఖల సంయుక్త ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో ఈ నెల 5 నుంచి 19 వరకు పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించనుంది.

షెడ్యూల్ వివరాలు ఇలా..

5వ తేదీ: ప్లాస్టిక్‌ను ఉపయోగించకూడదని చెప్పే కార్యక్రమాలను పాఠశాలల్లో నిర్వహించడం. పర్యావరణ అనుకూల వస్తువులను వాడటం, ప్లాస్టిక్ వస్తువుల సంఖ్య నోట్ చేయడం, ప్లాస్టిక్ వాడకానికి వ్యతిరేకంగా పోస్టర్లు, జనపనార వస్తువుల వాడకం, పర్యావరణ అనుకూల అలవాట్లు పెంపొందించడం వంటి కార్యక్రమాలపై అవగాహన చేపట్టడం జరుగుతుంది.

12న నీటి ఆదాపై : ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల ఆధ్వర్యంలో పాఠశాలల్లో నీటి లీకేజీని అరికట్టడం, పైపుల లీకేజీని తనిఖీ చేయడం, నీటి స్వచ్ఛత పరీక్షల నిర్వహణ, నీటి సంరక్షణ ర్యాలీ, వర్షపు నీటి నిల్వ వ్యవస్థలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించడం చేయాలి.

13న శక్తిని ఆదా చేయడం : విద్యుత్తుశాఖ ఆధ్వర్యంలో ఎనర్జీ సేవింగ్ యాక్టివిటీస్, ఎనర్జీటీమ్, ఎకో క్లబ్ ఎనర్జీ టీమ్‌తో డ్యూటీ రోస్టర్, నాలెడ్జ్ బిల్డింగ్ సెషన్లు, పోస్టర్లు, బ్యానర్లు, ఇతర విజువల్ మెటీరియల్ క్రియేట్ చేయడం, డిస్‌ప్లే బోర్డులు పోస్టు చేయడం వంటి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుంది.

14న శుభ్రతను కాపాడటం : పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో శుభ్రత, వ్యర్థాలను వేరు చేయడం, తరగతి గదుల్లో రెండు బిన్ వ్యవస్థలు, శానిటరీ వ్యర్థాలు, కంపోస్ట్ పిట్లు, వస్త్రాలు, బొమ్మలు వంటి వివరాల డ్రైవ్‌లు నిర్వహించడం, కమ్యూనిటీ సభ్యులతో ఇంటరాక్టివ్ సెషన్లు నిర్వహించడం (కంపోస్ట్ పిట్ల సంఖ్య సేంద్రియ వ్యర్థాలను వేరుచేయడం) వంటి కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుంది.

15న వ్యర్థాలను తగ్గించడం : పారిశుద్ధ్య శాఖ ఆధ్వర్యంలో వ్యర్థాలను సేకరించడం, భూమిపై ఈ వ్యర్థాల ప్రభావంపై పిల్లలతో చర్చించడం వంటి కార్యక్రమాల నిర్వహణ

18న స్థిరమైన ఆహార వ్యవస్థపై : కిచెన్ గార్డెన్‌లను అభివృద్ధి చేయడం, ప్లాస్టిక్ సీసాలు మొదలైన అందుబాటులో ఉన్న పదార్థాలను ఉపయోగించడం, వ్యర్థాలతో పర్యావరణ అనుకూల ఎరువులు, మొక్కల పెరుగుదల, ఉత్పత్తి రికార్డు నిర్వహించడం, పర్యావరణ ప్రయోజనాల గురించి చర్చించడం వంటి కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుంది.

19న ఆరోగ్యకర జీవనశైలిని అడాప్ట్ చేయడం: నేచర్ వాక్, ప్లాంటేషన్ డ్రైవ్, పర్యావరణ శాస్త్రం, చరిత్ర, భౌగోళిక ఆచారాలు, సంప్రదాయాలను పరిశీలించడానికి సమీప గ్రామాలకు అన్వేషణ సందర్శనలు వంటి కార్యక్రమాలను నిర్వహించాలి.

విజయవంతం చేయాలి



పర్యావరణ చైతన్య కార్యక్రమాలను విజయవంతం చేయాలి. నీటి వృథా అరికట్టడం, మొక్కలను నాటడం, విద్యుత్తు ఆదా, వ్యర్థాలను పునర్వినియోగించడం వంటి కార్యక్రమాలలో అన్ని డిపార్టుమెంట్‌లతోపాటు, స్వచ్ఛంద సంస్థలు, పర్యావరణ అవగాహన కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలి.

- మిట్టా కేశవరెడ్డి, కమ్యూనిటీ మొబలైజేషన్ ఆఫీసర్, సమగ్రశిక్ష

అన్ని పాఠశాలల్లో నిర్వహించాలి



పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అన్ని పాఠశాలల్లో కార్యక్రమాలను నిర్వహించాలి. షెడ్యూల్ ప్రకారం ఆయా తేదీలలో ఆయా పాఠశాలల్లో కార్యక్రమాలను నిర్వహించాలి. ఈ విషయంలో ప్రధానోపాధ్యాయులతోపాటు ఉపాధ్యాయులు ఆయా డిపార్టుమెంట్ అధికారుల సమన్వయంతో అన్ని కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలి. ఇందులో ఎవరు కూడా నిర్లక్ష్యం చేయరాదు.

- మర్రెడ్డి అనురాధ, జిల్లా విద్యాశాఖ అధికారి

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి


మృతి చెందిన చౌడేశ్వరి

వాల్మీకిపురం(అన్నమయ్య జిల్లా) : అనుమానాస్పద స్థితిలో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం రాత్రి వాల్మీకిపురం పట్టణంలో చోటు చేసుకొంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ప్రొద్దుటూరుకు చెందిన వెంకటేశ్వర్లు, రుక్మిణి దంపతుల కుమార్తె చౌడేశ్వరి (26)కి కలకడ మండలం కదిరాయచెరువుకు చెందిన చౌడయ్య, రెడ్డెమ్మ దంపతుల కుమారుడు మంజునాథతో 9 నెలల క్రితం వివాహం జరిగింది. మంజునాథ నిమ్మనపల్లి మండలం కొండయ్యగారిపల్లి విలేజ్ సెక్రటరీగా పని చేస్తూ, వాల్మీకిపురం పట్టణం బజారువీధిలో భార్యతో కలసి కాపురం ఉంటున్నాడు. అయితే శనివారం రాత్రి ఏమి జరిగిందో తెలియదు కానీ.. ఇంట్లో ఎవరూ లేని సమయంలో చౌడేశ్వరి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొంది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై నాగేశ్వరరావు సంఘటనా స్థలానికి చేరుకొని, మృతికి గల కారణాలపై ఆరా తీస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతురాలి తండ్రి వెంకటేశ్వర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై నాగేశ్వర రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఖాతాదారుల అవసరాలు తీర్చేలా సేవలు


మాట్లాడుతున్న ఏపీజీబీ చైర్మన్ సత్యప్రకాశ్‌సింగ్

కడప కోటిరెడ్డిసర్కిల్ : తమ ఖాతాదారులకు అధిక ప్రాధాన్యతనిస్తూ వారి అవసరాలు, ఆకాంక్షలు తీర్చేడమే లక్ష్యంగా ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు సేవలు అందిస్తోందని బ్యాంకు చైర్మన్ సత్యప్రకాశ్ సింగ్ తెలిపారు. ఆదివారం కడప నగరం మరియాపురంలోని ఏపీజీబీ ప్రధాన కార్యాలయంలో బ్యాంకు 19వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఆయన మాట్లాడుతూ అనంత, రాయలసీమ, పినాకిని గ్రామీణ బ్యాంకులను విలీనం చేయడం ద్వారా ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు 2006 జూన్ 1న ఉనికిలోకి రావడం జరిగిందన్నారు. బ్యాంకు బలోపేతం చేయడంలో రిటైర్డ్ సిబ్బంది అందించిన సేవలు ప్రశంసనీయమన్నారు. ప్రస్తుతం తమ బ్యాంకు అనంతపురం, బాపట్ల, కడప, కర్నూలు, నంద్యాల, ప్రకాశం, శ్రీ సత్యసాయి, తిరుపతి వంటి 10 జిల్లాల్లోని 9 ప్రాంతీయ కార్యాలయాల్లో విస్తరించి ఉందని, 511 శాఖల ద్వారా ఈ ఏడాది మార్చి 31 నాటికి రూ.46345 కోట్ల వ్యాపారం చేయడం జరిగిందన్నారు. రైతులు, స్వయం సహాయక బృందాలు, సమాజంలోని ఇతర అణగారిన వర్గాలకు ఆర్థిక సాయం అందించడంలో బ్యాంకు అన్నివేళలా ముందుంటుందన్నారు. ప్రస్తుత ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఖాతాదారులకు బేసిక్ మొబైల్ ఫోన్ ద్వారా ఇంటర్నెట్ కనెక్షన్, యూపీఐ ద్వారా మొబైల్ రీచార్జి, గ్యాస్ బుకింగ్, కరెంటు బిల్లు చెల్లించడం, మొబైల్ బ్యాంకింగ్, ఇంటర్నెట్ బ్యాంకింగ్ ద్వారా ఖాతాదారులు తమ డిపాజిట్ ఖాతాలకు నామినేషన్ నమోదు చేసుకునే సదుపాయం కల్పించడం జరిగిందన్నారు. నూతన డిజిటల్ సేవల ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టడం ద్వారా ఖాతాదారులకు మెరుగైన సేవలను అందించేందుకు కట్టుబడి ఉన్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు జనరల్ మేనేజర్లు పీఆర్ పడ్గేట్వార్, ఆర్.గిరి, సంజీవప్ప రంగప్ప టిగర్, రాజేంద్రన్, రంజిత్‌కుమార్‌తోపాటు ప్రధాన కార్యాలయ చీఫ్ మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కడప నగరంలో ఆంక్షలు అమలు

- 4న కౌంటింగ్ నేపథ్యంలో నిబంధనలు
- నగర శివార్ల నుంచి బస్సులు, ఇతర వాహనాల దారి మళ్లింపు
- అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయవద్దు
- 144 సెక్షన్ కింద నిషేధాజ్ఞలు అమలు
- జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్

కడప అర్బన్ : కడప నగర శివార్లలో ఈ నెల 4న రిమ్స్ ఆసుపత్రి సమీపంలోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ పాలిటెక్నిక్ కళాశాల భవనంలో కౌంటింగ్ జరగనున్న నేపథ్యంలో కడప నగరంలో ఆంక్షలు అమలులో వుంటాయని జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కడప నగరంలోకి ఎలాంటి వాహనాలు అనుమతించబోమని, నగర శివార్ల నుంచి దారి మళ్లించేలా ప్రణాళిక రూపొందించడం జరిగిందన్నారు. కడప నగరంలో 144 సెక్షన్ కింద నిషేధాజ్ఞలు అమలులో వుంటాయని తెలిపారు. అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయవద్దని ఎస్పీ ప్రజలకు సూచించారు.

వాహనాల దారి మళ్లింపు

రాయచోటి వైపు నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలను కడప నగరంలోకి అనుమతించరు. కడప మీదుగా ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు ఊటుకూరు సర్కిల్, సాక్షి సర్కిల్, ఇర్కాన్ సర్కిల్ మీదుగా ఔటర్ రింగ్ రోడ్‌పై ప్రయాణించాల్సి వుంటుంది.

- పులివెందుల నుంచి వచ్చే వాహనాలకు సాక్షి సర్కిల్ వరకు మాత్రమే అనుమతిస్తారు.
- రాజంపేట వైపు నుంచి వచ్చే వాహనాలు రామాంజనేయపురం మీదుగా ఇర్కాన్ జంక్షన్ రహదారిపై గమ్యస్థానానికి చేరుకోవాలి.
- మైదుకూరు, కమలాపురం వైపు నుంచి వచ్చే వాహనాలు ఇర్కాన్ సర్కిల్ మీదుగా వెళ్లాలి.
- ఎట్టి పరిస్థితుల్లో స్థానికులు తప్ప ఇతరులకు నగరంలోకి అనుమతి లేదు. స్థానికులైతే తప్పనిసరిగా గుర్తింపు కార్డును చూపించి నగరంలోకి ప్రవేశించేందుకు అనుమతిస్తారు.

అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లకు పార్కింగ్ ప్రదేశాలు


సిద్ధార్థ్ కౌశల్, జిల్లా ఎస్పీ

- వైఎస్‌ఆర్‌సీపీ ఏజెంట్లు, అభ్యర్థులకు ఇందిరానగర్ వద్ద ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలంలో వాహనాలు పార్కింగ్ చేయాలి. టీడీపీ ఏజెంట్లు, అభ్యర్థులకు శిల్పారామం వద్ద ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలంలో వాహనాలు పార్కింగ్ చేయాలి.
- పార్కింగ్ ప్రదేశాల నుంచి అభ్యర్థులు, ఏజెంట్లను ప్రత్యేక బస్సుల ద్వారా కౌంటింగ్ కేంద్రానికి తీసుకెళ్లడం జరుగుతుంది.

అభ్యర్థులు, ఏజెంట్లకు ముఖ్య గమనిక

అభ్యర్థులు, ఏజెంట్లు కౌంటింగ్ ప్రారంభానికి రెండు గంటల ముందే ఉదయం 6 గంటలకు కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలని జిల్లా ఎస్పీ తెలిపారు. 7 గంటల తరువాత వచ్చిన వారిని ఎట్టి పరిస్థితుల్లో కౌంటింగ్ కేంద్రంలోకి అనుమతించబోమని పేర్కొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె(అన్నమయ్య జిల్లా) : వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు ఆత్మహత్యకు ప్రయత్నించి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మదనపల్లె మండలం వేంపల్లి పంచాయతీ కొనగుంట్లపల్లెకు చెందిన శ్రీరాములు కుమారుడు బి.వాసుదేవ భార్య పుట్టింటికి వెళ్లి కాపురానికి రాలేదన్న మనస్తాపంతో.. శనివారం రాత్రి ఇంటి వద్దే పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అదే విధంగా కురబలకోట బీసీ కాలనీకి చెందిన ఖాదర్‌సాహెబ్ కుమారుడు సి.ఖాదర్‌వల్లి (48) కుటుంబ సమస్యల కారణంగా శనివారం రాత్రి ఇంటి వద్దే ఫినాయిల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్ వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

‘మన బడి’తో ప్రవాసాంధ్రుల్లో తెలుగు అభివృద్ధి


విద్యార్థికి సర్టిఫికెట్ అందజేస్తున్న నిర్వాహకులు

కడప కల్చరల్ : మన బడి కార్యక్రమం ద్వారా ప్రవాసాంధ్రుల్లో తెలుగు అభివృద్ధి ప్రశంసనీయమని కెనడాలోని సిలికాంధ్ర మనబడి కార్యక్రమం ఉపాధ్యక్షులు తోటపల్లి ధనుంజయ అన్నారు. శనివారం కెనడాలోని టొరెంటో నగరంలో నిర్వహించిన మన బడి-తెలుగు మాట్లాడటం కార్యక్రమం ముగింపు సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. తెలుగువారు ఏ దేశంలో ఉన్నా మాతృభాషను మరువరాదని, ఆంగ్లంతోపాటు తెలుగును కూడా పిల్లలకు నేర్పించాలని సూచించారు. ప్రపంచంలోని 12 దేశాలు, 250 ప్రాంతాలు, 2 వేలకు పైగా స్వచ్ఛంద సేవకులు, మాతృ భాషాభిమానుల ద్వారా 80 వేల మంది కంటే ఎక్కువ మంది విద్యార్థులు తెలుగుభాషను మన బడి కార్యక్రమం ద్వారా నేర్చుకుంటూ ఉండడం విశేషమన్నారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన వివిధ పోటీలలో బాల బాలికలు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. కెనడా ప్రాంత కార్యక్రమ సమన్వయకర్త గీతా దేశు మాట్లాడుతూ కొన్నేళ్లుగా కెనడాలోని వివిధ ప్రాంతాల్లో స్వచ్ఛంద సేవకుల సహకారంతో పలు కార్యక్రమాలు నిర్వహిస్తూ తెలుగు భాషాభివృద్ధికి కృషి చేస్తున్న బిందు, విజయ్, లక్ష్మి, మార్గాని, అంకిత, దేశు, చల్లా చంద్రహాసరెడ్డిలు అభినందనీయులన్నారు. పోటీలో విజేతలకు ఆగస్టు 16, 17 తేదీల్లో అమెరికాలోని డెట్రాయిట్ నగరంలో చివరి పోటీలు నిర్వహిస్తామన్నారు. అనంతరం ప్రకాశం, ప్రభాసం స్థాయికి చేరుకున్న స్నాతకోత్తర విద్యార్థులకు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వారి ప్రశంసా పత్రాలు, పట్టాలు అందజేశారు. మన బడి విద్యార్థులు నృత్యప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలతో అందరినీ ఆకట్టుకున్నారు.

బీన్స్ సాగు.. ఆదాయం బాగు

- మార్కెట్‌లో రికార్డు స్థాయిలో ధర
- కిలో రూ.130 నుంచి రూ.150
- టమాటలో అంతర్ పంటగా సాగు
- రైతుల్లో ఆనందం


మండల పరిధిలో సాగు చేసిన బీన్స్ పంట


రవాణాకు సిద్ధంగా ఉన్న బీన్స్ కాయలు

గుర్రంకొండ(అన్నమయ్య జిల్లా) : బీన్స్ కాయల సాగు రైతుల ఇంట సిరులు కురిపిస్తున్నాయి. బీన్స్ పంట చరిత్రలో తొలిసారి రికార్డు స్థాయిలో ధర పలుకుతోంది. ప్రస్తుతం మార్కెట్‌లో కిలో రూ.130 నుంచి రూ.150 వరకు పలుకుతుండడం విశేషం. రైతులు టమాట పంటలో అంతర్ పంటగా బీన్స్‌సాగు చేసే కొత్త పద్ధతికి శ్రీకారం చుట్టారు. ఆరుతడి పంటల్లాగా నీటి సౌకర్యం తక్కువగా ఉన్న పొలాల్లో సైతం ఈ పంట సాగు అవుతుండడం గమనార్హం.

జిల్లాలో 350 హెక్టార్లలో సాగు

ప్రస్తుతం జిల్లాలో 350 హెక్టార్లలో బీన్స్ కాయల పంటను సాగు చేశారు. ఎకరా పంట సాగు చేయడానికి గాను రూ.80 వేల వరకు ఖర్చు అవుతుందని రైతులు తెలిపారు. పొలం దుక్కులు దగ్గర నుంచి కాయలు కాసే వరకు ఈ ఖర్చు అవుతుంది. మొక్కలు నాటిన 40 రోజులకు కాపు వస్తుంది. కేవలం రెండు కోతలకే పంట మొత్తం అయిపోతుంది. ఇక రోగాల బెడద చాలా తక్కువ. పూత, పిందెలు వచ్చే సమయంలో లద్దె పురుగులు ఆవహిస్తాయని.. అప్పుడు మాత్రమే రసాయనిక మందులు స్ప్రే చేయించాల్సి ఉంటుంది. మందుల ఖర్చు కూడా తక్కువే. వరి పంట లాగా రోజూ నీళ్లు కట్టాల్సిన అవసరం లేదు. అయిదురోజుల కొక మారు నీరు పెట్టినా సరిపోతుంది.

ఎకరాకు రూ.3 లక్షల వరకు ఆదాయం

గతంలో ఎన్నడూ లేనంతగా మార్కెట్లో అత్యధికంగా రికార్డు స్థాయి ధరలు పలుకుతున్నాయి. కిలో రూ.130 నుంచి రూ.150 వరకు పలుకుతుండటం విశేషం. గత 25 ఏళ్లుగా ఒకటి రెండు సార్లు మాత్రమే కిలో రూ.100 వరకు ధర పలికింది. అలాంటిది ఈ ఏడాది తొలిసారిగా అత్యధిక ధర పలుకుతుండడం విశేషం. పంట దిగుబడి బాగా వస్తే ఎకరాకు 1.5 టన్నుల నుంచి 2 టన్నుల వరకు కాయలు కాస్తాయి. ప్రస్తుతం బీన్స్ కిలో అత్యధికంగా రూ.150 వరకు ధర పలుకుతోంది. ఈలెక్కన ఎకరాకు రూ. 3 లక్షల వరకు లాభం వస్తుందని రైతులు అంటున్నారు. కేవలం 40 రోజుల్లోనే చేతికొచ్చే ఈ రకం పంటతో రైతుల ఇంట లాభాల పంట పండుతోంది.

తక్కువ పెట్టుబడి

జిల్లాలో ముఖ్యంగా పడమటి మండలాల రైతులు టమాట పంటలో అంతర్ పంటగా బీన్స్ సాగు చేస్తుండటం గమనార్హం. టమాట పంట కోతలు సగం అయిపోయే దశలో బీన్స్ విత్తనాలు నాటేస్తున్నారు. టమాట పంట పూర్తిగా అయిపోయిన తరువాత బీన్స్ పంట చేతికొస్తుంది. టమాట పంటకు పెట్టే నీటితోనే ఈ పంటను సాగు చేస్తున్నారు. టమాటకు వినియోగించే ఎరువులతోనే ఈ పంట సాగువుతోంది. టమాటకు నాటిన కట్టెలే వీటికి ఉపయోగపడుతున్నాయి. మొత్తం మీద అతి తక్కువ పెట్టుబడితో టమాటలో అంతర్ పంటగా బీన్స్ సాగు చేస్తున్నారు. బీన్స్ కాయలను ఇక్కడి రైతులు చెన్నై, బెంగళూరు, తిరుపతి మార్కెట్‌లకు తరలించి విక్రయిస్తుంటారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు బీన్స్‌తో వస్తుండడంతో రైతులు లాభాల బాట పడుతున్నారు.

దిగుబడి తగ్గడంతో పెరిగిన ధరలు

సాధారణంగా జిల్లాలో ఈ సీజన్‌లో సుమారు 1350 హెక్టార్ల నుంచి 1550 హెక్టార్ల వరకు పడమటి మండలాల్లో బీన్స్ పంటను సాగు చేస్తుంటారు. ఈ ఏడాది రైతులు ఎక్కువగా టమాట, పూల సాగుపై దృష్టి సారించారు. దీంతో బీన్స్ సాగు 350 హెక్టార్లకు పడిపోయింది. దీనికితోడు అధిక ఎండలు, అకాల వర్షాలతో బీన్స్ తోటలు ఎక్కువగా రోగాల బారిన పడి దెబ్బతిన్నాయి. వీటిన్నింటిని తట్టుకొని చేతికొచ్చిన పంటకు మార్కెట్లో అధిక ధర పలుకుతున్నాయి. ముఖ్యంగా చెన్నై మార్కెట్లో బీన్స్‌కు మంచి డిమాండ్ ఏర్పడింది. ఆశించినంత మేరకు జిల్లాలో బీన్స్ దిగుబడి లేక పోవడం ప్రస్తుతం ధరలు పెరగడానికి కారణంగా వ్యాపారులు చెప్పుకొంటున్నారు.

ఎన్నడూ ఇలాంటి ధరలు లేవు

బీన్స్ పంటకు ఎన్నడు కూడా ఇలాంటి ధరలు రాలేదు. గత 15 ఏళ్లలో ఒకసారి మాత్రమే మార్కెట్లో అత్యధింగా రూ.100 వరకు ధర పలికాయి. మళ్లీ ఇప్పుడు కిలో రూ.150 వరకు ధర పలకడం విశేషం. ఇంత పెద్ద ఎత్తున బీన్స్‌కు ధరలు రావడం ఇదే మొదటి సారిగా చూస్తున్నాం. టమాట కంటే ప్రస్తుతం బీన్స్‌కే మంచి ధరలు ఉండడంతో మంచి లాభాలు చూస్తున్నాం.

- నరసింహులు, మొరంపల్లె, గుర్రంకొండ మండలం

దిగుబడి తక్కువగా ఉంది

ఈ సీజన్‌లో బీన్స్ పంట దిగుబడి చాలా తగ్గిపోయింది. ఎక్కువ మంది రైతులు ఈ మారు టమాట, పూల సాగు చేపట్టారు. తక్కువ విస్తీర్ణంలోనే బీన్స్ పంటలు సాగు చేశారు. పంట దిగుబడి లేకపోవడంతో బీన్స్‌కు మార్కెట్లో డిమాండ్ బాగా ఏర్పడింది. మన జిల్లాతోపాటు కర్ణాటక, తమిళనాడు మార్కెట్లో కూడా బీన్స్‌కు మంచి డిమాండ్ ఉండటంతో ఇంత పెద్ద ఎత్తున ధరలు పలుకుతున్నాయి.

-వెంకటరమణ, దాదంవారిపల్లె, గుర్రంకొండ మండలం